విద్యార్థులకు నోట్‌బుక్స్, పుస్తకాల పంపిణీ

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్‌కు చెందిన ఇద్దరు పేద విద్యార్థినులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం నోట్‌బుక్స్, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ అజ్గర్, సిరిల్‌లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, బర్ల రాజ్‌కుమార్, దొంగల కుమార్, భూషపాక శ్రీనివాస్, జెరుపోతుల వెంకటేష్, మాతంగి స్వామి, పోగుల శ్రీనివాస్, రామ్, నర్సింగ్, బండారి రాజేందర్, ఒగ్గుల భద్రయ్య, జానపట్ల యాదగిరి పాల్గొన్నారు.

వెంకటాద్రినగర్‌లో..

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వెంకటాద్రినగర్ కాలనీలో ఫెనిక్స్ సొసైటీ ఆధ్వర్యంలో బ్యాక్ టు స్కూల్ విత్ స్మైల్ అనే కార్యక్రమంలో భాగంగా 50మంది పేద విద్యార్థులకు నోటు పుస్తకాలతో పాటు స్టేషనరీని ఆదివారం పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు జీతు జోన్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి అన్నమ్మ జాన్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



కాజీపేట రూరల్: విద్యార్థినికి నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



కాజీపేట: వెంకటాద్రినగర్ కాలనీలో పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

విద్యారంగ సమస్యలపై పోరాడాలి

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలపై పోరాడాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు సూచించారు. హనుమకొండలోని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నియంత్రించడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే గ్రామీణ ప్రాంతాలకు కూడా కార్పొరేట్ పాఠశాలలు విస్తరించాయని ధ్వజమెత్తారు. దాంతో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 29న వరంగల్ పర్యటనలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిని సీఎం ప్రారంభిస్తూ ప్రభుత్వ వైద్యం గురించి మాట్లాడడం శోచనీయమని అన్నారు. యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. సమావేశంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోతు రాజేష్‌నాయక్, బాధ్యులు రంగస్వామి, చందగణేష్, సంజయ్, నగేష్, వెంకట్, వీరబాబు, రాకేష్, మంగేష్, వంశీ, ప్రవీణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చందర్‌రావు

అశోకకాలనీలో రామ మందిర నిర్మాణం

హన్మకొండ: హనుమకొండలోని అశోకకాలనీలో రామ మందిరం నిర్మించాలని కాలనీవాసులు నిర్ణయం తీసుకున్నట్లు కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సోమేశ్వర్ రావు, దేవాలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వెంకట రాజారెడ్డి తెలిపారు. హనుమకొండలోని కల్యాణి ఫంక్షన్ హాల్‌లో అశోక కాలనీ హిందూ బంధుమిత్రుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కాలనీలోని గాంధీ విగ్రహం సమీపంలో 400 గజాల స్థలాన్ని సేకరించి రామ మందిరం నిర్మించుకోవాలని తీర్మానించినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా వెంకట రాజారెడ్డి రూ.4 లక్షల విలువగల చెక్కును విరాళంగా అందజేశారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు వెంకట రాజారెడ్డి, చింత శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అశోకకాలనీ అభివృద్ధి కమిటీ కార్యదర్శి నర్సిరెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, దేవాలయ కమిటీ కార్యదర్శి కృష్ణారెడ్డి, కోశాధికారి సుధాకర్ స్వామి, కాలనీవాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాలనీవాసులు

ప్రజాపాలన ప్రభుత్వంలో అరెస్టులా?



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

హన్మకొండ: అక్రమ అరెస్టులు, నిర్బంధాలు విధించడమే ప్రజాపాలనా అని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ప్రశ్నించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయాలని అడిగితే అరెస్టు చేస్తారా, ఇదెక్కడి న్యాయమన్నారు. శనివారం సీఎం పర్యటన సందర్భంగా విద్యార్థి నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. నిరుద్యోగులకు ఉద్యోగ క్యాలెండర్, గ్రూప్ -2, గ్రూప్-3లో పోస్టులు పెంచుతామన్న హామీ ఏమైందని అన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన తీరుగానే నిరుద్యోగ, విద్యార్థి సమస్యలపై పోరాడుతామని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర్ల మనోజ్ కుమార్, నాయకులు లంక రాజ్‌గోపాల్, గంద్రకోట రాకేష్ యాదవ్, పిల్లల నాగరాజ్, గొల్లపల్లి వీరస్వామి, టీజీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పబ్బోజు శ్రీకాంత్ చారి పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

కాశిబుగ్గ: వరంగల్ మండల సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి బుస్స రవీందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు కాశిబుగ్గ జంక్షన్‌లో శిక్షణ తరగతుల పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9, 10వ తేదీల్లో కొత్తవాడలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. తరగతులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి హాజరవుతారని తెలిపారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసేది సీపీఐ అని రవీందర్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండె బద్రి, సంద్ర కుమార్, అశోక్, రమేష్, రాయల, స్వప్న, వెంకన్న, దేవరాజు, ఐలయ్య లక్ష్మి, అనూష తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పోరాటాలకు అందరూ సిద్ధం కావాలి

రామన్నపేట: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన ఎన్నికల హామీలను నాయకులు తుంగలో తొక్కి, ఉదాసీన వైఖరి అవలంబించడాన్ని నిరసిస్తూ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ తెలిపారు. ఈమేరకు దశలవారి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీపాద సోమయ్య అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లపై ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంభించడం బాధాకరమని వాపోయారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మారెడ్డి, కోశాధికారి కుమారస్వామి, బాధ్యులు స్వయం ప్రకాశ్, నిజామొద్దీన్, ఈశ్వరమూర్తి, సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరువరంగం ప్రభాకర్

రజక జాతి అభివృద్ధికి పాటుపడదాం

కాజీపేట అర్బన్: అన్నిరంగాల్లో వెనుకబడిన రజక జాతి అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య సూచించారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలోని చాకలి ఐలమ్మ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా రజక ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ జనరల్ బాడీ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై సారయ్య మాట్లాడారు. రజక ఉద్యోగుల సంక్షేమానికి సంఘం కృషి చేయాలన్నారు. జనరల్ బాడీ సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఉల్లెంగుల కొమురవెల్లి, పతంగి సమ్మయ్య, కోశాధికారిగా సట్టు సోమయ్య ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సారయ్య

పాలస్తీనీయులపై దాడులను ఖండించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐఓ బాధ్యులు

న్యూశాయంపేట: పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ చేస్తున్న క్రూరమైన దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ కోరారు. హనుమకొండ నగరంలోని జక్రియా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిరసనగా తెలిపారు. తొలుత ఎస్ఐఓ ఆధ్వర్యంలో ఎంజీఎం జంక్షన్ నుంచి జక్రియా ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఇజ్రాయిల్ దాడుల్లో అనేక మంది మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత భారత ప్రభుత్వాలు పాలస్తీనా దేశానికి మద్దతు ఇచ్చిన విధంగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా అన్ని విధాలా మద్దతు పలకాలని సూచించారు. ఇజ్రాయిల్ తయారీ వస్తువులను బహిష్కరించాలని ఎస్ఐఓ వరంగల్ అధ్యక్షుడు ఫహీమొద్దీన్ కోరారు. జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షుడు ముబషీర్ జాఫర్, వరంగల్ అధ్యక్షుడు అబ్దుల్ హస్నన్, గరల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ తెలంగాణ అధ్యక్షులు మసీరా ఫిర్దోస్ పాల్గొన్నారు.

కార్మిక ఉప కమిషనర్‌కు ఆత్మీయ వీడ్కోలు

హన్మకొండ చౌరస్తా: వరంగల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా పదవీ విరమణ పొందుతున్న రమేష్‌బాబును కార్మిక శాఖ సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు ఆదివారం సత్కరించారు. హనుమకొండ వంద ఫీట్ల రోడ్డులోని జువెల్ గార్డెన్‌లో జరిగిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో రమేష్‌బాబు - ఉషారాణి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో శ్రమశక్తి అవార్డు గ్రహీతలు తాటి సత్యనారాయణ, కుసుమ శ్యాంసుందర్ పాల్గొన్నారు.



రమేష్‌బాబు దంపతులను సన్మానిస్తున్న సత్యనారాయణ, శ్యాంసుందర్

కౌలు రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలి

హసన్‌పర్తి: కౌలు రైతులకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాసభ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై రైతు భరోసా రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా పదెకరాల లోపు ఉన్న వారికి రైతు భరోసా వర్తింపజేయాలని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రస్తుతం గుట్టలు, ఖాళీ స్థలాలు, వెంచర్లకు కూడా రైతు భరోసా పథకం వర్తింపజేస్తున్నట్లు డీసీఓ దృష్టికి తీసుకెళ్లారు. వారి పేర్లను రైతుబంధు జాబితా నుంచి తప్పించాలని కోరారు. అలాగే పంటలకు మద్దతు ధర కల్పించాలని సూచించారు. అనంతరం డీసీఓ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు. సొసైటీ చైర్మన్ మేర్గు రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సొసైటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీఓ నాగేశ్వర్‌రావు

నాగారం మాజీ ఉపసర్పంచ్ మృతి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం నాగారం మాజీ ఉపసర్పంచ్ బండారి సాంబయ్య మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. బీఆర్ఎస్‌లో కొనసాగుతూ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. సాంబయ్య మృతిపై కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు పుట్ట రవి, ఎంఎస్పీ హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ రాజారపు భిక్షపతి, నాయకులు, తదితరులు సంతాపం తెలిపి, బాధితులను పరామర్శించారు.

బాధిత చిన్నారికి వైద్యం అందించాలి

వరంగల్: హైదరాబాద్ ఎల్బీనగర్‌లో అత్యాచారానికి గురైన నాలుగేళ్ల చిన్నారికి ప్రభుత్వం సరైన వైద్యం అందించాలని భారత జాతీయ మహిళా సమైఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) వరంగల్ మండల శాఖ నాయకులు కోరారు. ఈమేరకు పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌కు బానిసై తాగిన మత్తులో మహిళలు, యువతులు, బాలికలపై కామాంధులు అత్యాచారాలకు ఒడిగడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యాచారానికి పాల్పడిన వారికి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల, మండల కార్యదర్శి బచ్చల స్వప్న, నేతవత్ లక్ష్మి, అనూష, సరస్వతి, భార్గవి, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

డయల్ 100కు వెంటనే స్పందించాలి

రాయపర్తి(వర్ధన్నపేట): డయల్ 100 కేసులపై తక్షణమే స్పందించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశించారు. వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. స్టేషన్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామాల్లో బ్లూకోల్ట్స్ సిబ్బంది గస్తీ నిర్వహించాలని సూచించారు. అనంతరం నేరుగా ఫిర్యాదుదారులతో మాట్లాడారు. వర్ధన్నపేట అంబేడ్కర్ సెంటర్ వద్ద ట్రాఫిక్‌పై సూచనలిచ్చారు. ఆయన వెంట ఏసీపీ నర్సయ్య, ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 1న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట, జేఎస్ఎం స్కూల్, డీ కన్వెన్షన్, అవంతి స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు, నందిహిల్స్, జూపార్కు, హంటర్ హిల్స్, అర్కా స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

షైరింగ్ పోటీలకు వర్ష ఎంపిక



రామన్నపేట: ఈనెల1 నుంచి 10వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్‌లో జరగనున్న ఎస్సీసీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ స్థాయి షైరింగ్ పోటీలకు నగరంలోని ఎల్బీ కళాశాలలో డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న బండి వర్ష ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. ఈ మేరకు పోటీల్లో పాల్గొనేందుకు వర్ష ఆదివారం బయలుదేరినట్లు ఆమె వివరించారు. వర్షను కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు, చైర్మన్ నిరంజన్, సెక్రటరీ ఈ.రాజేందర్, పాలక మండలి సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి, ఎన్సీసీ ఆఫీసర్ డాక్టర్ సదానందం పాల్గొన్నారు.

ఓయూ నుంచి కేడీసీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ విభాగం అధిపతి బాధ్యతలు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ మసూద్ అహ్మద్ మహమూదికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. హైదరాబాద్‌లోని ఓయూలో ఫిజిక్స్ విభాగంలో పరిశోధకుడు మసూద్ అహ్మద్.. 'ఫిజికల్ ఆప్టికల్ స్ట్రక్చరల్ అండ్ బయోయాక్టివ్ స్టడీస్ ఆఫ్ మిక్స్‌డ్ అల్కాలి బోరోసిలికెట్ క్యాల్షియం జింక్ గ్లాసెస్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ లక్ష్మణ్ పర్యవేక్షణలో అహ్మద్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఆయన వరంగల్ ప్రాంతానికి చెందినవారు. డాక్టరేట్ పొందిన మహమూదిని కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

వాస్తు పండిత్ అవార్డు ప్రదానం



కాజీపేట అర్బన్: నగరానికి చెందిన ఆకుల రజిని ప్రవీణ్‌కుమార్‌కు తమిళనాడు విల్లుపురంలో ఇంటర్నేషనల్ హిందూ టెంపుల్స్ అండ్ స్పిరుచ్వల్ ఆస్ట్రాలజర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ వాస్తు పండిత్ అవార్డు -2024ను ఆదివారం అందజేసింది. ప్రవీణ్‌కుమార్‌ను ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ జే.విశ్వనాథన్ సన్మానించి అవార్డు ప్రదానం చేశారు.

పాత కలప విక్రయానికి వేలం

ఖిలా వరంగల్: మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో నిరుపయోగంగా ఉన్న పాత కలపను ఈనెల 4న వేలం ద్వారా విక్రయించనున్నట్లు పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2వ తేదీలోపు మరింత సమాచారం కోసం 8099159122 నంబర్‌లో రిజర్వు ఇన్‌స్పెక్టర్ అధికారి ఎస్.మహేష్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రజాభవన్‌లో క్రికెట్ సంబురాలు

హన్మకొండ చౌరస్తా: టీ - 20 క్రికెట్ మ్యాచ్‌లో భారత్ అద్భుత విజయం సాధించడం తామందరికి గర్వకారణమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం క్రికెట్ సంబురాలను జరుపుకున్నారు. వరంగల్ క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభానురావు ఆధ్వర్యంలో ప్రజాభవన్‌లో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, క్రికెట్ సంఘం బాధ్యులు బండారి ప్రభాకర్, తాళ్లపెల్లి విద్యాసాగర్, విజయ్, మట్టెడ కుమార్ పాల్గొన్నారు.

సంబురాలు చేసుకుంటే లాఠీచార్జ్ చేశారు

హన్మకొండ చౌరస్తా: టీ - 20 క్రికెట్ మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై భారత్ ఘన విజయం సాధించడంపై సంబురాలు జరుపుకుంటున్న తమపై హనుమకొండ సీఐ లాఠీచార్జ్ చేశారని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యుడు దర్శన్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. అలంకార్ జంక్షన్ నుంచి చౌరస్తా వరకు ర్యాలీ తీసి సంబురాలు జరుపుకుంటుండగా లాఠీచార్జ్ చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే ఏసీపీ, సీపీలకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చానని, సోమవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తానని ఆయన అన్నారు.

ప్రధాన రహదారిపై పైపులైన్ లీకేజీ



కాజీపేట చౌరస్తాలోని ప్రధాన రహదారిపై ఆరు నెలలుగా తాగునీటి పైపులైన్ లీకవడంతో అక్కడ ఓ పెద్ద గుంత ఏర్పడింది. అది ప్రమాదకరంగా మారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- కాజీపేట